# శివరాత్రి



-కోన శ్రీనివాసరావు

**మహా** శివరాత్రి పర్వదినం !

సాయం సంధ్య వాలి పోతోంది. .

నేను శివాలయం గేట్లో అడుగు పెట్టేటప్పటికి గేటు మొదట్లో కూర్చున్న రంగసామి నన్ను చూసి పలకరింపుగా నవ్వాడు. తన దగ్గరున్న నాలుగైదు కొబ్బరి కాయల్లో మంచిది యేరి నా కిస్తూ, "తొరగా వెళ్ళి దర్శనం చేసుకురండీ, బాబూ, యియాల శివరాత్రి గదా ! జనం పెరిగిపోతారు బాగా" అన్నాడు.

నేను చిన్నగా నవ్వుతూ, చెప్పులు అతని దగ్గర వదిలి లోపలికి నడిచాను.

గర్భగుడి చుట్టూ ప్రదక్షిణం చేసి, గుళ్ళో ప్రవేశించి దైవదర్శనం చేసుకుని, అభిషేకం చేయించటానికి మరో పావుగంట ఆలస్యముందంటే మళ్ళీ బయటికి వచ్చి, ధ్వజస్తంభం దగ్గర మంటపంలో కూర్చున్నాను.

ఎదురుగా ఆలయం గేటు. గేటు మొదట్లో రంగసామి. రంగసామి కెదురుగా సీతారావుడు. వాళ్ళిద్దరూ కాక మరో ఇద్దరు.

ఆలయంలోకి వచ్చి పోయే భక్తుల్ని యాచించి పొట్ట పోసుకోవటం వాళ్ళ వృత్తి. ఆ నలుగురిదీ ఒకే వృత్తి అయినా, రంగసామి కూర్చున్న చోటుకు ఒక ప్రాముఖ్యముంది. ఆ స్థానంలో వారాని కొకరు వంతున నలుగురూ రొటేషన్ పద్ధతిలో కూర్చుంటారు. ఆ స్థానంలో ఉన్న వాళ్ళు చేసేది యాచన అనేకంటే—వృత్తి అంటే బాగుంటుందేమో. ఆలయంలోకి వచ్చే భక్తులు అతని దగ్గర చెప్పులు విడిచి లోపలికి వస్తారు. అతను వాళ్ళకి నంబరున్న అట్ట ముక్క నొదాన్ని ఇచ్చి, అదే నంబరున్న మరో అట్టముక్కని వాళ్ళ చెప్పుల్లో ఉంచుతాడు గుర్తు కోసం. దర్శనం చేసుకుని వెళ్ళేప్పుడు భక్తులు తమ చెప్పులు తీసుకుని, అత నికి అయిదు పైసలిచ్చి వెళ్తారు.

కానీ, నా కెందుకో ఆ నలుగురి లోనూ రంగసామంటే అదో రకమైన అభిమానం. వచ్చిన సంపాదనను ఆ నలుగురూ సమంగా పంచుకోటంలో ఉన్న వాళ్ళ ఐకమత్యం నాకు చూడ ముచ్చటగా ఉంటుంది. నేను ప్రతి ఆదివారం శివాలయానికి వచ్చి వెళ్తుండ టాన ఆ నలుగురూ నాకు పరిచయమే, గత మూడేళ్ళుగా.

రంగసామికి కూడా నేనంటే ఎంతో ఆప్యాయత.

నేను తదేకంగా రంగసామినే చూస్తు న్నాను. అరవైకి ఒకటో రెండో తక్కువగా వయస్సు. తెల్లబడి బాగా వెనక్కి పెరిగిపోయిన జుట్టు. పొడుగ్గా తెల్లగా మెరుస్తున్న గడ్డం. గత జీవితపు అనుభవాన్ని జీర్ణించుకుని ముడతలు పడ్డ చర్మం. లోతుకు పోయిన కళ్ళు. పీక్కుపోయిన బుగ్గలు, నుదుట విభూతి రేఖలు. శరీరానికి కాషాయి వస్త్రాలు. మెళ్ళో రుద్రా క్షలు. ఒక మహాజ్ఞానిలా కనిపిస్తు న్నాడు రంగసామి.

"తాతా! ఇవిగో అట్ట ముక్కలు—చాలా?" అన్న మాటలకు ఆలోచనల్లో నుండి తేరుకుని వీధివైపు చూశాను.

కిట్టిగాడు పేక ముక్కలు ఏరు కొచ్చి రంగసామి కిచ్చాడు. కిట్టిగాడ్ని రంగసామి పెంచుకుంటున్నాడు. అంతే కాదు, చదివిస్తున్నాడు కూడా. కిట్టి గాడు అయిదో క్లాసు చదువుతున్నాడు.

రంగసామి ఆ పేకముక్కల్ని అంద కుంటూ నావైపు చూశాడు.

"ఈటిమీదన అంకెలేసి పెట్టు, బాబూ ! ఇయాల శివరాత్రిగందా. మా రద్దీగా ఉంటాది" అన్నాడు రంగసామి నా దగ్గరికొచ్చి.

నేను నవ్వుతూ వాటిని అందుకుని నంబర్లు వేసిచ్చాను.

రంగసామి తన స్థానంలో కెళ్ళి కూర్చున్నాడు.

ఆలయంలో కుడి పక్కగా ఉన్న స్టేజీమీద భజన జరుగుతోంది.

"మారేడు నీవని నే నేరి తేనా
మా రేడు దళములు నీ పూజకు"

—ఎవరో శ్రావ్యంగా పాడుతున్నారు.

ఎడమ ప్రక్కగా ఉన్న నవగ్రహాల ఆలయంలో శని దేవుడికి యెవరో తైలాభిషేకం చేయిస్తున్నారు.

ధ్వజస్తంభానికి కొద్ది దూరంలో ఉన్న మారేడు చెట్టుమీంచి రెండు పక్షులు ఆకాశంలో కెగిరిపోయాయి. సన్నగా వీచిన గాలికి నాలుగైదు మారే డాకులు నా కాళ్ళ ముందు పడ్డాయి.

ధ్వజ స్తంభం దగ్గరున్న ప్రమిదలో ఒక ముత్తయిదువ నూనె పోసి, వత్తులు వెలిగించింది.

మళ్ళీ రంగసామి వైపు చూశాను.

నా కెందుకో రంగసామి ఇవాళ చాలా నీరసంగా ఉన్నా డనిపించింది—రెండు మూడు రోజుల్నుండి అన్నం తిననివాడిలాగా !

నిజమే కావచ్చు.

ఆకాశాన్నంటుతున్న ధరలతో ఎవడి సంసారం వాడికే బరువవుతున్న ఈ రోజుల్లో—వీళ్ళ సంగతి పట్టించుకునే వా ళ్ళెంతమంది?

నా ఆలోచన నాకే నవ్వు తెప్పించింది.

అరగంట గడిచింది. రంగసామి చేతిలో నంబర్లున్న పేక ముక్కలై పోయాయి. కిట్టిగాడు కనుచూపు మేరలో కనిపించలేదు. బహుశ మళ్ళీ పేక ముక్కలకోసం వెళ్ళి ఉంటాడు.

గేటు దగ్గిర ఆటో ఆగిన చప్పుడు!

అటుకేసి తల తిప్పాను. అందు లోంచి ఇద్దరు యువతులు దిగారు. ఖరీదైన చెప్పుల్ని రంగసామి దగ్గిర విడిచి, లోపలి కొచ్చి జనంలో కలిసి పోయారు.

ఆలయమంతా భక్తులతో సందో హంగా ఉంది.

మరో పావుగంట తర్వాత మెల్లగా లేచి, అభిషేకం చేయించాలని గర్భ గుడిలోకి వెళ్ళాను.

అర్చకుడు నా గోత్ర నామాలో అభిషేకం చేస్తుంటే నేను కళ్ళు మూసుకుని, చేతులు జోడించి, నమస్క రిస్తూ ఉండిపోయాను.

పూజ ముగించుకుని, తీర్థ ప్రసా దాలు తీసుకుని జనాన్ని తప్పుకుంటూ బయటికి వచ్చేటప్పటికి దాదాపు గంట సేపు పట్టింది.

బయట హడావిడిగా కేకలు విని పిస్తుంటే గేటువైపు చూశాను. వీధిలో గేటు ముందర ఆటో ఆగి ఉంది. ఆటోకి కొద్ది దూరంలో గుండ్రంగా జనం మూగి ఉన్నారు.

గేటు మొదట్లో రంగసామి, సీతా ముగ్గురూ కనిపించలేదు.

ఏదో జరిగి ఉంటుందనుకుంటూ వీధిలో కెళ్ళి, గుంపులోని జనాన్ని తోసుకుంటూ వంగి చూశాను.

నా కళ్ళను నేనే నమ్మలేకుండా ఉన్నాను.

రంగసామి క్రిందపడి ఉన్నాడు — మూలుగుతూ !

ఒక్క ఉదుటున దగ్గిరి కెళ్ళి రంగసామి తలని ఎత్తి నా ఒడిలో ఉంచుకుంటుంటే — అతని చాతీ మీదినుండి కారుతున్న రక్తం చూసి నా గుండె ఒక్క క్షణం ఆగిపోయి నట్లనిపించింది.

రంగసామి స్పృహలో లేడు.

''అసలేం జరిగింది?'' సోడాకొట్టించి రంగసామి మొహం మీద చల్లుతూ అడిగాను కోపంగా.

సీతారావుడు చెప్తున్నాడు—


''ఆ యమ్మగారు యిందాక సెప్పు లిచ్చి వెళ్ళినారంటయ్యా. సంజరేమో ఈయబేదంట. ఆ యమ్మేమో అదా వుడిలో సెప్పులు తీసుకోటం మళ్ళి పోయి యింటికెళ్ళి, మళ్ళీ యిప్పుడు తిరిగొచ్చి అడిగితే ఈ దొంగనాయాలు మీా రిందాకనే యేసుకెల్లారు, నాకేం తెల్దంటున్నాడయ్యా ! ఈ దొంగ సచ్చినోడే యూడో దాసేసుంటాడండీ! యీడి మూలంగా రేపటాల్నుండి మా పొట్టలు కూడా నిండవు, బాబూ! ఈడికింత దురాశ యెందుకొచ్చిందో? అవి కొత్తవంటయ్యా—నిన్ననే ఖరీదు సేసినారంట. అట్నే సూడగానే యీడి గళ్ళు కుట్టుంటాయి''

''సీతారావుడూ!'' అరిచినంత పని చేశాను.

నిన్నటిదాకా సంపాదన్ని నలుగురూ సమంగా పంచుకున్న వీళ్ళేనా ఇలా మాట్లాడుతోంది? ఇంతలోనే వీడికీ, వీళ్ళ యూనిటికీ యేమైంది? అనిపించింది నాకు.

నా కెందుకో రంగసామి అలా చేసి ఉండడన్న నమ్మకం బాగా ఉంది.

రంగసామి మెల్లగా కళ్ళు తెరిచాడు.




మరో సోడా కొట్టించి అతని నోట్లో పోస్తుంటే మెల్లగా గుటకేస్తూ తాగుతున్నాడు రంగసామి.

ఇంక మరీ ఆలస్యం చేయటం ఇష్టంలేక, రిక్షాని పిలిచి అతన్ని మెల్లగా ఎక్కించి, జేబులోంచి ఇరవై రూపాయలు తీసి ఆ ఆడవాళ్ళ కిచ్చేసి, నేనూ రిక్షాలో యెక్కి హాస్పిటల్‌కి పోనిమ్మన్నాను.

రిక్షా వేగంగా దూసుకుపోతోంది.

కిట్టిగాడు ఎక్కడినుంచి వచ్చాడో రిక్షా వెనుకే పరిగెత్తుకొస్తున్నాడు. వాడికోసం రిక్షా ఆపి, వాడ్ని ఎక్కించు కోవాలని అనిపించలేదు నాకు. ఎంత తొందరగా ఆస్పత్రికి వెళ్తే అంత మంచిదని నా మనసు ఆరాటపడుతోంది.

అసలు రంగసామికి, నాకూ ఏమిటి బంధం ?

తనెందు కిలా తల దూర్చాడీ విషయంలో?

తన గుండె ఎందుకింత ఆరాటంతో వేగంగా కొట్టుకుంటోంది?

ఇవన్నీ సమాధానం దొరకని ప్రశ్నలైనా, వూహాకందని బంధ మేమో అనిపించింది తామిద్దరిదీ! సాటి మనిషిగా మానవత్వంతో ఈ విష యంలో తల దూర్చానేమోనని సమా ధాన పరుచుకోవలసి వచ్చింది మనసుని. తోటి మనిషిగా, మూడేళ్ళుగా పరిచయ మున్న వ్యక్తి—అతనెవరైనా— బిచ్చగా డైనా, లక్షాధికారైనా, ప్రాణాపాయ స్థితిలో ఉంటే తనకు చేతనైన సాయం చేయుటంలో మానవత్వం చోటు చేసు కుని మనసు అనిర్వచనీయమైన సంతృప్తికి లోనవుతుంది. ఆ ఆత్మ సంతృప్తిలో ఉన్న ఆనందం అమూల్య మేమో?

రిక్షా హాస్పిటల్ ముందాగింది.

రిక్షావాడి సహాయంతో రంగసామిని లోపల బెంచీమీద పడుకోబెట్టి, రిక్షా, అతన్ని పంపించేశాను.

రంగసామి బాధతో గుండె దగ్గిర చేయి పెట్టుకుని విలవిల్లాడు తునాడు.

డాక్టర్ రావ్‌ని కలిసి విషయమంతా చెప్పగానే, ఆయన తక్షణం కేసు అటెండ్ లయాడు.

నేను బయట బెంచీ మీాద కూర్చుని ఆలోచిస్తుండి పోయాను.

రంగసామి నిజాయితీగల వ్యక్తి. అతను కేవలం ఒక చెప్పుల జత కోసం ఆశపడి దాచాడంటే నేను యేమాత్రం నమ్మ లేక పోతున్నాను. కారణం ఏమైనా, నిజానిజాలెలా ఉన్నా, ఆ నలుగురూ నిన్నటి దాకా ఒకటిగా కలిసి మెలిసి ఉన్న ఆ నలుగురూ మూకుమ్మడిగా రంగసామిని అమానుషంగా పీడరించు కోవటం, చెయ్యి చేసుకోవటం, తలుచు కుంటేనే నాకు అసహ్యంతో వళ్ళంతా కంపర మెత్తినట్లు అనిపించింది.

''అయ్యా! మాతాత...'' అంటున్న కిట్టిగాడి మాటలకు లోకంలోకి వచ్చాను.

తలెత్తి అతని వంక జూశాను.

పరుగెత్తుతూ వచ్చినందు వళ్ళేమో అతని గుండె ఎగసి పడుతూంది. రొప్పుతో. వాడి కళ్ళల్లో గిర్రున తిరుగు తున్న నీళ్ళు వన్ను విచలితుడ్ని చేస్తు న్నాయి. వాడి గొంతు దుఃఖంతో పూడుకపోయింది.

నేను తెప్పరిల్లి, '' మీా తాత లోపల ఉన్నాడు, నీకేం భయంలేదు!''అన్నాను.

కానీ, నా మాటలు నాకే వింతగా అనిపించాయి. పదేళ్ళ కిట్టిగాడ్ని వాడి దుఃఖాన్ని నే నెలా ఆపగలను?

కిట్టిగాడు గబగబా లోపలికి పరి గెత్తబోయాడు.

వాడి రెక్కపట్టుకుని వాణ్ణి నెమ్మది పర్చటానికి నే నెంతో కష్టపడాల్సి వచ్చింది.

పది నిమిషాలు గడిచాయి.


డాక్టర్ లోపలి నుంచి బయటికి వచ్చాడు.

ఆయన్ని చూడగానే నాలోని ఆత్రం మరింత ఎక్కువైంది.

ఎదరెళ్ళి అడిగాను ''డాక్టర్! అతని కెలా ఉంది?''

''సారీ, సూర్యం! ఈ రాత్రి గడిస్తే గానీ యేమీా చెప్పలేను. రాయి మొన బాగా లోతుగా గుండెలో దిగి పోయింది. ఇంతకు ముందే కాస్త తెలివి వచ్చింది. మీాతో ఏదో మాట్లాడాలంటున్నాడు. యు మె అటెండ్ హిమ్. కానీ తొంద రగా వచ్చేయండి. అతనికి ఎక్కువ స్ట్రెయిన్ ఇవ్వద్దు.''

డాక్టర్ తన గదిలోకి వెళ్ళిపోయాడు.




ఆయన మాటలు వింటూనే నన్ను నీరసం కమ్మేసింది. ఒళ్ళంతా చెమటలు పడుతున్నట్లయింది.

ఎలాగో గుండె దిటవు చేసుకుని కిట్టుగాడ్ని వెంట బెట్టుకుని లోపలికి అడుగు పెట్టాను.

రంగసామి నన్ను చూసి లేవ బోయాడు. కిట్టుగాడ్ని, నన్ను చూసే టప్పటికి ప్రాణం లేచి వచ్చినట్లు అని పించిందేమో?

లేవద్దని అతని వారిస్తూ, వెళ్ళి మంచం మీద ప్రక్కగా కూర్చున్నాను. అతని నోటి వెంట ఎలాంటి మాటలు వినాల్సి వస్తుందోనన్న భయంతో గుండె వేగం మరీ ఎక్కువైంది.

రంగసామి కిట్టిగాడిని దగ్గరికి రమ్మని సైగ చేశాడు.

వాడు రంగసామి దగ్గర కెళ్ళి అతని చేతుల్లో మొహం దాచుకుని వెక్కుతున్నాడు.

కిట్టిగాడి చేతుల్ని తన చేతుల్లోకి తీసుకుని, తిరిగి నా చేతిలో పెడుతూ గొంతు పెగుల్చుకుని అన్నాడు రంగసామి.

''బాబూ!''

''రంగసామీ!—'' నా గొంతులో వణుకు.

''అయిపోయింది, బాబూ, ఈ రంగ సామి పని అయి పోయింది. ఇన్నాళ్ళ నా నిజాయితీ అంతా బూడిదలో పోసిన పన్నీరై పోయింది. నావాళ్లే నాకు దొంగ తనం అంటగట్టారు, బాబూ! కానీ నేనే పాపము ఎరగనయ్యా. నేనూ ఒకప్పుడు బాగా బతికినోడినే బాబూ! నా ఖర్మ ఇలా కాలి, అడుక్కుతింటున్నా! కూటికి పేదనేగానీ, గుణాని క్కాదు. బాబూ! ఆతల్లి అప్పుడే సెప్పలేను కెల్లిం దయ్యా మళ్ళీ వచ్చి నన్నడిగితే నే నేడ నుండి తేగల్ను సెప్పు, బాబూ! నువ్వయినా నేను దొంగనికానని నువ్వైనా సెప్పు, బాబూ. మూడేళ్ళనుండి నన్ను సూత్తుండవు, గదా!''

రంగసామి కళ్ళు వర్షిస్తున్నాయి.

కన్నీళ్ళు ధారలై తెల్లటి మీసాల్ని తాకు తున్నాయి.

''వూరుకో రంగసామీ, వూరుకో! నీ సంగతి నాకు తెలుసు కదా!''

''బాబూ! నువ్వో మాటియ్యాలి నాకు. ఈ కిట్టిగాడి సంగతంతా నువ్వే సూసుకోవాలి, బాబూ. నాకీ భూమ్మీద నూకలై పోయాయయ్యా!''

''అలాగే, రంగసామీ! కానీ నువ్వలా మనసు పాడు చేసుకోకు. నీకు తొందరగా నయమై మళ్ళీ మామూలుగా అయి పోతుంది. నువ్వింక విశ్రాంతి తీసుకో.''

''నేను సెప్పేది పూర్తిగా ఇనుకో బాబూ! నాకింక ఈ నాటితో పూర్తి ఇశ్రాంతి, బాబూ! ఈ కిట్టిగాడ్ని నా పాణానికి పాణంగా పెంచాను, బాబూ! వాడి అమ్మెవరో, అయ్యెవరో తెలీక పోయినా దేవుడిచ్చాడని యెంతో పాణంగా పెంచాను, బాబూ! పదేళ్ళ క్రిందట గుడి ముందట అర్థరాత్రి నేను నిదట్లో ఉండగా దొరికాడు, బాబూ ఈడు. ఏ తల్లి కని పారేసిందో కానీ, నేను మాత్రం ఎంతో యిదిగా సూసు కుంటున్నా నయ్యా. ఈడిని నీ కప్పగి త్తుండా! దేవుళ్ళా కనిపిస్తున్నావు బాబూ నువ్వు ?.''

రంగసామి కాసేపు ఆగాడు.

కానీ నా వంట్లో వణుకు ఆరంభ మైంది.

రంగసామి నాపై ఉంచిన భారాన్ని మోయగలనా అనిపించింది. గుండెనిండా ఆత్మ విశ్వాసాన్ని నింపుకుని, రంగ సామి కోసం, అతని ఆత్మతృప్తి కోసం కిట్టిగాడ్ని వాడి జీవితాన్నీ తీర్చి దిద్దాలని నిర్ణయించు కున్నాను.

ఆలోచన్ల నుంచి తేరుకుని రంగ సామికేసి చూశాను.

రంగసామి యెగశ్వాస పీలుస్తున్నాడు.

వెంటనే పరుగులాంటి నడకతో డాక్టర్ దగ్గరి కెళ్ళి సంగతి చెప్పాను. డాక్టర్ రావ్ స్టెత్ తీసుకుని హడా వుడిగా వస్తున్నాడు. వెనుకే నేనూ వెళ్తున్నాను. 'భగవాన్ రంగసామి ప్రాణాన్ని తీసుకుపోకు' అని మూగగా రోదిస్తూ.

''బాబూ!''

వెనక్కి తిరిగి చూశాను.

సీతారావుడు! !

సీతారావుడు పరుగుస్తూ వస్తున్నాడు.

అతన్ని చూస్తూనే నాకు అసహ్య మనిపించింది.

కానీ—

నిలబడ్డాను.

''బాబూ! రంగసామి కెట్టాగుంది? అసలు ఆ సెప్పులు పోనేదంట, బాబూ! ఆయమ్మ గుడికాడ నుంచి సెప్పు లేసుకుని వెళ్తూ మధ్యలో ఆల్ల బంధు లింట్లో విడిచి, అడ మర్చిపోనాదంట, బాబూ! మీరిటు రాగానే, ఆల్లేవచ్చి సెప్పి, ఈ ఇరవై రూపాయ లిచ్చి యెల్లినారు! దొంగ సచ్చినోళ్ళం. నీతిగా బతికే రంగసామిని నోటి కొచ్చినట్లు మాటలన్నాం, బాబూ! మాబుద్ధి గడ్డి తింది బాబూ!

నా చెవుల కేమీ వినబడటం లేదు.

సీతారావుడి కళ్ళల్లో కూడా నీళ్ళు తిరుగు తున్నాయి.

నిజం యెప్పుడూ ఆలస్యంగానే తెలుస్తుంది!

''రంగసామి కెలాగుంది, బాబూ!'' అంటున్న సీతారావుడ్ని వెంట తీసుకుని లోపల కడుగు పెట్టబోయిన నేను— తెల్లటి దుప్పటిని రంగసామి మొహం మీద కప్పుతున్న డాక్టర్ని చూసి నిశ్చేష్టు డినై పోయాను.

''రంగసామీ!'' అంటూ రంగసామి జీవంలేని శరీరం మీదబడి ఏడుస్తున్న సీతారావుడ్ని చూస్తుంటే వాడి తెలివి తక్కువతనానికి నాకు నవ్వాలో, యేడ వాలో తెలీలేదు.

రంగసామి గుండె మీదపడి ఏడు స్తున్న కిట్టిగాడ్ని దగ్గరికి తీసుకుని వాడి తల నిమురుతూ, ''రంగసామీ! నీ ఆత్మశాంతి కోసం వీడ్ని పెంచు తాను' అనుకుంటూ అలాగే నిర్వి ణ్ణుడినై నిల్చున్న నాకు, నాకళ్ళలో నుండి రెండు కన్నీటి చుక్కలు రాలి కిట్టిగాడ్ని తాకటం నేను గమనించక పోలేదు. *